సాక్షి
కృష్ణాజిల్లా
బుధవారం । 4 । సెప్టెంబర్ । 2024



వాహనాల వెలికితీత..

నందిగామ టౌన్: మండలంలోని ఐతవరం సమీపంలో జాతీయ రహదారిపై వరద ఉధృతికి పలు వాహనాలు కొట్టుకుపోయాయి. వాటిని మంగళవారం బయటకు తీసుకొచ్చారు.



సందట్లో సడేమియా..!

వరదల నేపథ్యంలో నిత్యావసర వస్తువులకు రెక్కలు వచ్చాయి. కూరగాయలు, పాలు, పెరుగు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.

-12లో

నేడు పాఠశాలలకు సెలవు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లకు కలెక్టర్ బాలాజీ ఆదేశాల మేరకు బుధవారం సెలవు ప్రకటించినట్లు డీఈఓ తాహెరాసుల్తానా మంగళవారం తెలిపారు. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు స్కూళ్లకు వెళ్లి అక్కడి పరిస్థితిని ఎంఈఓలకు నివేదించాలని సూచించారు.



న్యూస్‌రీల్

వరద బాధితులకు కార్తికేయుడి పులిహోర ప్యాకెట్లు



మోపిదేవి: బెజవాడ వరద బాధితులకు శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం నుంచి పులిహోర, వాటర్ ప్యాకెట్లను సరఫరా చేశామని ఆలయ ఏసీ ఎన్.ఎస్.చక్రధరరావు మంగళవారం తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, దేవదాయ–ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఆ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆదేశాల మేరకు ఆరు వేల పులిహోర ప్యాకెట్లు, పది వేల వాటర్ ప్యాకెట్లుతో కూడిన వాహనాన్ని విజయవాడ వరద బాధితులకు పంపించామని పేర్కొన్నారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ, ప్రధానార్చకుడు బుద్దు పవన్‌కుమార్ శర్మ, ఆలయ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితుల సేవలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాకు చెందిన సుమారు 500 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మూడు రోజుల నుంచి వరద బాధితులకు సేవలు అందిస్తున్నట్లు జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, కేబీఎన్ డిగ్రీ కళాశాల, మేరీ స్టెల్లా కళాశాల, ఫార్మసీ కళాశాల, నలంద కళాశాల, హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు వరద బాధితులకు ఆహారం, తాగునీరు, పాలు, కొవ్వొత్తులను బాధితులకు సరఫరా చేయడంతోపాటు, వరద ప్రభావిత ప్రాంతాల నుంచి ఒడ్డుకుచేర్చడం వంటి సేవా కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారని వివరించారు. సింగ్ నగర్, కృష్ణలంక, యనమలకుదురు, రామవరప్పాడు, మాచవరం, వన్‌టౌన్ తదితర ప్రాంతాల్లో సేవలు అందిస్తున్నారని తెలిపారు.

సహాయక చర్యల్లో పాల్గొని గుండెపోటుతో వ్యక్తి మృతి



కోడూరు: వరద సహాయక చర్యల్లో పాల్గొన్న వ్యక్తి ఇంటి వెళ్లాక గుండెపోటుతో మృతిచెందిన ఘటన కోడూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ ఆంజనేయులు కథనం మేరకు.. మండలంలోని విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన కోలా శంకర్ (45) సోమవారం గ్రామంలో కరకట్ట వద్ద జరిగిన సహాయక చర్యల్లో పాల్గొన్నారు. కరకట్టను పటిష్ట పర్చేందుకు తోటి గ్రామస్తులతో కలిసి ఇసుక మూటలను సిద్ధం చేసి, కరకట్టకు రక్షణ చర్యల్లో పాల్గొన్నారు. సహాయక చర్యలు ముగిశాక సాయంత్రం ఇంటికి వెళ్లి విశ్రాంతి తీసుకున్నారు. ఉన్నట్టుండి శంకర్‌కు గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయాడు. కుటుంబీకులు హుటాహుటిన అవనిగడ్డ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు తల్లి కృష్ణవేణి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

కొట్టకుండానే చేతిపంపుల నుంచి నీరు



అవనిగడ్డ: వరద ముంపు ప్రాంతాల్లో కొట్టకుండానే చేతిపంపుల నుంచి నీరు ధారగా వస్తున్న ఘటనలు ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. కృష్ణా నదికి వరద పోటెత్తడంతో భూగర్భ జలాలు పెరిగి ఇలా చేత్తో కొట్ట కుండానే చేతిపంపుల నుంచి నీరు బయటకు వస్తున్నట్టు తెలుస్తోంది. మోపిదేవి మండలంలోని బండిగ్లాంక, కొక్కిలిగడ్డ, బొబ్బర్లంక, అవనిగడ్డ మండలంలోని దక్షిణ చిరువోలులంక, పులిగడ్డ గ్రామాల్లో ఇలా చేతిపంపుల నుంచి కొట్టకుండానే నీరు బయటకు రావడంతో ఈ ప్రాంత ప్రజలు వింతగా చూస్తున్నారు.

శాంతించిన కృష్ణమ్మ

- కృష్ణా నదిలో తగ్గుముఖం పట్టిన వరద
- 8.42 లక్షల క్యూసెక్కులకు తగ్గిన వరద ఉధృతి
- ఇంకా తేరుకోని లోతట్టు ప్రాంతాలు
- పునరావాస కేంద్రాల్లో అరకొర సౌకర్యాలతో ప్రజల ఇబ్బందులు
- 35 వేల హెక్టార్ల పంట పొలాలు ముంపులోనే..
- వరద తగ్గితేనే నష్టం అంచనాలు సాధ్యమంటున్న అధికారులు
- భయపెడుతున్న బుడమేరు వరద



కోడూరు మండలం చినగూడుమోటు సమీపంలో సముద్రాన్ని తలపిస్తున్న వరిచేలు

సాక్షి, మచిలీపట్నం: మూడు రోజుల పాటు జిల్లా ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేసిన వరద తగ్గుముఖం పట్టింది. ఎగువ కురిసిన వర్షాల కారణంగా కృష్ణా నదికి భారీగా వరద నీరు పోటెత్తింది. ప్రకాశం బ్యారేజీ 70 గేట్లను పూర్తిగా ఎత్తివేసి సముద్రంలోకి నీటిని వదిలారు. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో సోమవారం 11,43,201 క్యూసెక్కుల వరద విడుదలైంది.



కోడూరు మండలంలో కోతకు గురైన కరకట్ట

దీంతో జిల్లాలోని పెనమలూరు, తోట్లవల్లూరు, చల్లపల్లి, మోపిదేవి, అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు తదితర మండలాల్లోని లంక గ్రామాలపై తీవ్ర ప్రభావం చూపింది. కృష్ణా వరద మంగళవారం కాస్త శాంతించింది. ఉదయం నుంచే తగ్గుముఖం పట్టింది. ఉదయం 9 లక్షల క్యూసెక్కులుగా ఉన్న వరద ప్రవాహం సాయంత్రానికి 8.42 లక్షల క్యూసెక్కులకు తగ్గింది. కృష్ణమ్మ శాంతించడంతో జిల్లా ప్రజలు కాస్త ఊపిరి పీల్చుకుంటున్నారు. అయినా లోతట్టు ప్రాంతాలు ఇంకా తేరుకోలేదు. నిర్వాసితులు పునరావాస కేంద్రాల్లోనే ఉన్నారు. అక్కడ అరకొర సౌకర్యాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లు కోతకు గురవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలు చోట్ల చెరువులకు పడిన గండ్లను రైతులు తాత్కాలికంగా పూడ్చుకున్నారు. మరోవైపు బుడమేరు ఉప్పొంగి ప్రవహించడంతో చెరువులకు గండ్లు పడ్డాయి. రోడ్లు కోతకు గురయ్యాయి. పంటలు ముంపునకు గురయ్యాయి.

15 మండలాల్లో వరద ప్రభావం

జిల్లాలో వరద ప్రభావం 15 మండలాల్లో ఉంది. 50 గ్రామాలు వరదలో చిక్కుకున్నాయి. మచిలీపట్నం రెవెన్యూ డివిజన్‌లో 18, గుడివాడ డివిజన్‌లో 19, ఉయ్యూరు డివిజన్‌లో 13 గ్రామాలు ఉన్నాయి. మొత్తంగా 2.37 లక్షల మంది బాధితులుగా మారారు. పెనమలూరు మండలం యనమలకుదురు, పెదపులిపాక గ్రామాలు ముంపునకు గురయ్యాయి. 28 ఇళ్లు దెబ్బతిన్నాయి. పక్కా గృహం ఒకటి పూర్తిగా, మూడు పాక్షికంగా, 25 పూరిళ్లు దెబ్బతిన్నాయి. మూడు జంతువులు, నాలుగు గొర్రెలు మరణించాయి. రోడ్లు కోతకు గురవడతో రూ.20 కోట్ల నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు.

35 వేల హెక్టార్లలో వరద నీరు

వరద నీరు 35 వేల హెక్టార్ల పంటపొలాల్లోకి చేరింది. జిల్లాలో ఇప్పటి వరకు 1,39,069 హెక్టార్లలో ఖరీఫ్ పంటలు సాగవుతున్నాయి. వరి 1.37 లక్షలు, పత్తి 270, వేరు శనగ 340, మినుము 597, చెరకు 556 హెక్టార్ల, మిగిలిన విస్తీర్ణంలో వివిధ పంటలు సాగవుతున్నాయి. వరి 33,985, పత్తి 180, వేరుశనగ 270, మినుము 44, చెరుకు 235 హెక్టార్లు, ఇతర పంటలు కలిపి మొత్తం 35,111 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. 25 మండలాల్లోని 384 గ్రామాల్లో సాగైన వరిపై ప్రభావం చూపగా 35,313 మంది రైతులు నష్టపోయారు.



చోడవరం పర్ర వద్ద నీట మునిగి కుళ్లిన వరి పైరును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రమేష్‌బాబు

రాత్రంతా పహారా

ప్రకాశం బ్యారేజీ నుంచి 12 లక్షల క్యూసెక్కుల వరద వస్తుందనే హెచ్చరికలతో దివిసీమలోని చాలా గ్రామాల ప్రజలు సోమవారం రాత్రంతా కంటిమీద కునుకు లేకుండా బలహీనంగా ఉన్న కరకట్టల వద్ద పహారా కాశారు. యువకులు, పెద్దలు రక్షణ చర్యల్లో పాలుపంచుకున్నారు. వరద ముప్పు తగ్గడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పెనమలూరు నియోజకవర్గంలోని పెద్దపులిపాక, యనమలకుదురు, మద్దూరు, కాసరనేని వారిపాలెం వద్ద వరద ఉధృతి తగ్గింది. పంట పొలాలు ముంపు నుంచి బయటపడుతున్నాయి. బుడమేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఉప్పలూరు మంతెన, తెన్నేరు గ్రామాలపై దీని ప్రభావం తీవ్రంగా ఉంది. మంతెన చుట్టూ నీరు చేరింది. పామర్రు నియోజకవర్గంలోని తోట్లవల్లూరులో పసుపు, కంద, అరటి, పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కంద, పసుపు పంటలు పూర్తిగా నీటిలో మునిగిపోవడంతో కుళ్లిపోయే ప్రమాదం ఉంది.



కంకిపాడు మండలం మద్దూరులో వరద ముప్పు నుంచి బయటపడుతున్న కంద తోట

పలు చోట్ల వర్షాలు

జిల్లాలో మంగళవారం పలు చోట్ల వర్షాలు పడ్డాయి. అధికంగా పెనమలూరులో 5.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా తోట్లవల్లూరులో 0.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పలు గ్రామాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి. నందివాడ మండలం పుట్టగుంట వద్ద బుడమేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇప్పటికే నీటి ప్రవాహం 22 అడుగులకు చేరిందని అధికారులు తెలిపారు. బుడమేరు పరీవాహక గ్రామాల్లో వరి పొలాలు ఇంకా వరదలోనే ఉన్నాయి. గుడివాడ, గుడ్లవల్లేరు మండలాల్లోని వరి పొలాల్లో నీరు బయటకు పోయేలా ఇప్పటి వరకు అధికారులు చర్యలు చేపట్టలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెడన నియోజకవర్గంలో 7,475 ఎకరాలు నీట మునిగాయి. దీనిపై అధికారులు ప్రాథమిక అంచనా తయారుచేసి నివేదిక పంపించారు.

పులిగడ్డ అక్విడెక్టుపై నుంచి కొనసాగుతున్న వరద

అవనిగడ్డ నియోజకవర్గంలో వరద ఉధృతి కొనసాగుతోంది. పులిగడ్డ అక్విడెక్టు ఇంకా వరద నీటిలోనే ఉంది. ఈ ప్రాంతంలో 25 అడుగుల మేర వరద నీరు ప్రవహిస్తోంది. దివిసీమలోని పలు గ్రామాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. పునరావాస కేంద్రాలు కొనసాగుతున్నాయి. అవనిగడ్డ మండల పరిధిలోని పాత ఎడ్లంక, పులిగడ్డ పల్లెపాలెం, రేగుల్లంక, వసుమట్ల, దక్షిణ చిరువోలులంక, చల్లపల్లి మండలం ఆముదార్లంక, మోపిదేవి మండలం కె.కొత్తపాలెం, బొబ్బర్లంక గ్రామాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. సోమవారం కంటే వరద మూడడుగులు తగ్గినప్పటికీ ఇంకా ఆయా గ్రామాల్లోని గృహాలు వరద నీటిలోనే మునిగి ఉన్నాయి. మోపిదేవి, కోడూరు, అవనిగడ్డ, నాగాయలంక మండలాల్లో బాధితుల కోసం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.



గన్నవరం మండలం అప్పారావుపేట వద్ద ఏలూరు కాలువకు పడిన గండి



నందివాడ మండలం పుట్టగుంట వద్ద వరిచేలను ముంచిన బుడమేరు వరద



తోట్లవల్లూరు మండలంలో నీటమునిగిన అరటి తోట

కలెక్టరేట్‌లో చంద్రబాబు ఏమి చేస్తున్నారు?

- ప్రజలకు తాగునీరు సైతం అందించలేరా?
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు వెలంపల్లి శ్రీనివాసరావు



వరద ప్రాంతాల్లో పర్యటిస్తున్న వెలంపల్లి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): 'ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కలెక్టర్ కార్యాలయంలో కూర్చుని ఏమి చేస్తున్నారు? వరద బాధితులకు కనీసం తాగునీటిని సైతం సరఫరా చేయలేకపోతున్నారా?' అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు ప్రశ్నించారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో వరద ముంపునకు గురైన గట్టువెనుక ప్రాంతాల్లో వెలంపల్లి మంగళవారం పర్యటించారు. ప్రజల యోగ క్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇలాంటి ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు తక్షణం పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేసి ప్రజలకు అక్కడ అన్ని సౌకర్యలు కల్పించామని గుర్తుచేశారు. ప్రత్యేక అధికారులను నియమించి వలంటీర్లు, సచివాలయాల సిబ్బంది ద్వారా ప్రజలకు ముందస్తు సమాచారం అందించామని పేర్కొన్నారు. ప్రజలపై టీడీపీ కూటమి ప్రభుత్వం దుర్మార్గంగా ప్రవర్తిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. బోట్లు పెట్టామని ప్రభుత్వం ప్రచారం చేస్తోంది కానీ వాటి సేవలు ఎక్కడా అందడంలేదని ప్రజలు పేర్కొంటున్నారని వివరించారు. తమను కాపాడాలని ప్రజలు కన్నీరు మున్నీరుగా వేడుకుంటున్నా అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శించారు. రూ.1500, రూ.2000 ఇస్తేగానీ బోటు ఎక్కే పరిస్థితి లేదని ప్రజలు బాధపడుతున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి ఎక్కడ ఉన్నారో ఎవరికీ తెలియదని ఎద్దేవాచేశారు. నిన్న ఈ ప్రాంతానికి వచ్చి బోట్ షికారు చేసి వెళ్లిపోయాడని పేర్కొన్నారు. చంద్రబాబుకు రాజకీయం చేయడం తప్ప ప్రజలకు మంచి చేద్దామనే ఉద్దేశం లేదని దుయ్యబట్టారు. వరదను అంచనా వేయడంలో, ముందస్తు చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- బుడమేరు ఉధృతంగా ప్రవహిస్తోంది
- 8 వేల మంది పునరావాస కేంద్రాలకు తరలింపు
- అత్యవసర వేళ ప్రజల్ని తరలించేందుకు బోట్లు సిద్ధం
- జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ



మంతెన పునరావాస కేంద్రంలో నిర్వాసితులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ

కంకిపాడు: బుడమేరు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జాయింట్‌కలెక్టర్ గీతాంజలి శర్మ సూచించారు. మండలంలోని బుడమేరు ముంపు ప్రాంతాలైన ఉప్పలూరు, మంతెన గ్రామాల్లో జేసీ మంగళవారం విస్తృతంగా పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రం, ఎంపీపీ పాఠశాలల్లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలను సందర్శించి నిర్వాసితులతో మాట్లాడారు. బుడమేరు ముంపు ప్రభావంపై అధికారులతో సమీక్షించారు. అనంతరం గీతాంజలి శర్మ మాట్లాడుతూ.. వరద, వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా ముంపు సమస్య నెలకొందన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు ఎనిమిది వేల మందిని ముంపు బారి నుంచి కాపాడి పునరావాస కేంద్రాలకు తరలించామని తెలిపారు. కృష్ణానదికి నీటి ఉధృతి స్వల్పంగా తగ్గిందన్నారు. బుడమేరు ఉధృతంగా ప్రవహిస్తోందని హెచ్చరించారు. పంట పొలాలు, ఇళ్లు ముంపు బారిన పడుతున్నాయని వివరించారు. నష్టాన్ని అధిగమించేందుకు అన్ని చర్యలూ తీసుకున్నామన్నారు. ట్రాక్టర్లు, అత్యవసర పరిస్థితుల్లో ప్రజల్ని తరలించేందుకు పడవలను కూడా ఏర్పాటుచేశామని వెల్లడించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బుడమేరు ఉధృతి క్రమంలో స్థానికంగా ఉన్న యువత అందించిన సహాయ సహకారాలు అభినందనీయమని కొనియాడారు. జేసీ పర్యటనలో ఆర్డీఓ డి.రాజు, తహసీల్దార్ వి.భావన్నారాయణ పాల్గొన్నారు.

కండ్రిక కన్నీరు పెడుతోంది

- అనారోగ్యంతో పాటు వరదా దెబ్బ తీసింది
- రక్షించే వారు లేరు.. ఆహారం అందించే నాథుడూ లేడు
- బోరున విలపిస్తున్న బాధిత కుటుంబాలు

ప్రత్తిపాడు, లక్ష్మీపురం(గుంటూరు): విజయవాడ కండ్రిక కన్నీరు పెడుతోంది.. నాలుగు రోజులుగా వరద నీటిలో చిక్కుక్కున్న బాధితుల ఆర్తనాదాలు అరణ్య రోదనలుగా మిగిలాయి. రూపాయి.. రూపాయి.. కూడబెట్టుకుని కలల సౌధాన్ని నిర్మించుకున్న అభాగ్యుల ఆశలను వరద నీరు ముంచెత్తింది. నాలుగు రోజులుగా కుందావారి కండ్రిక, రాజీవ్‌నగర్, పాయకాపురం, ముస్తాబాద ప్రాంతాల వరద బాధితులు ఎలాంటి సహాయం అందక అల్లాడుతున్నారు. అనారోగ్యంతో ఉన్న వారిని, వృద్ధులను సైతం ఆదుకోవడంలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగడానికి నీళ్లు, తినడానికి భోజనం లేదని వాపోతున్నారు. ఒక్కో కుటుంబానికో కన్నీటి గాథ. వారి బాధలు చెప్పుకొని విలపిస్తున్న తీరు హృదయాలను కలచివేస్తోంది.

ఈ గండం గట్టెక్కేదెలా?

కండ్రికకు చెందిన వృద్ధురాలు లక్ష్మి బోదకాలుతో బాధపడుతోంది. విషజ్వరంతో మంచాన పడింది. తల్లిని కాపాడుకోవడానికి ఆమె కుమారుడు తిరుపతయ్య పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. మేడపైన డేరా వేసి తల్లిని ఉంచాడు. వారికి తిండి లేదు. గుక్కెడు మంచి నీళ్లూ లేవు. జ్వరంతో బాధపడుతున్న తల్లిని ఆస్పత్రికి తీసుకెళ్లలేని పరిస్థితి. తిరుపతయ్య తండ్రి అతి కష్టం మీద గుణదల వెళ్లి రెండు మాత్రలు తీసుకొచ్చి లక్ష్మికి వేశారు. ఈ గండం గట్టెక్కేదెలా దేవుడా అంటూ ఆ కుటుంబం రోదిస్తోంది.

ఇప్పుడు మా బతుకేమిటి?

నెల్లూరు జిల్లాకు చెందిన గుత్తి కిషోర్, రమా దంపతులు ఐదేళ్ల క్రితం పొట్ట చేత పట్టుకుని విజయ వాడ వచ్చారు. కండ్రికలో అద్దె ఇంట్లో ఉంటు న్నారు. వస్త్ర దుకాణంలో నెలకు రూ.11 వేల జీతంతో ఆ కుటుంబం నెట్టుకొస్తోంది. విధి కిషోర్ కుటుంబాన్ని దారుణంగా దెబ్బతీసింది. నాలుగేళ్ల క్రితం వారికి పుట్టిన పాప అనారోగ్యం బారిన పడింది. డబ్బుల్లేక పూర్తిస్థాయిలో చికిత్స చేయించుకోలేక చివరికి ఆ పాపనే కోల్పోయిన దురదృష్ట దంపతులు వీళ్లు. కిషోర్‌కు నరాల వాపుతో పాటు ఇతర అనారోగ్య సమస్యలూ ఉన్నాయి. అతని భార్య హైబీపీ, ఇతర సమస్యలతో బాధపడుతోంది. వరదలు మరింతగా దెబ్బతీశాయి. ఇప్పుడు బతుకేమిటా అని ఆ దంపతులు విలపిస్తున్నారు.

ప్రాణాలు అరచేత పట్టుకుని..

కండ్రిక రాజీవ్ నగర్‌లో లింకన్ రాజేష్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతని ఇంటిని వరద ముంచెత్తడంతో ఆరోగ్యం మరింతగా దెబ్బతింది. అతని కుటుంబాన్ని రక్షించడానికి అధికారులు ఎవరూ రాలేదు. మంగళవారం రాజేష్ ఆరోగ్యం మరింత దెబ్బతినడంతో కుటుంబ సభ్యులు స్థానికుల సహాయంతో ట్రాక్టర్‌లో అతి కష్టంమీదు ఆసుపత్రికి తరలించారు.

వాసనొస్తున్న ఆహారం సరఫరా

కండ్రిక, పాయకాపురం, రాజీవ్‌నగర్ వంటి ప్రాంతాలలో అధిక శాతం వరద బాధితులకు ఆహారమే అందడంలేదు. సరఫరా చేస్తున్న కొద్ది పాటి ఆహారమూ నాణ్యత లేక వాసన వస్తోంది. దీంతో ఆహార పొట్లాలను రోడ్డు పక్కనే పారేసి వెళ్లిపోతున్నారు. కండ్రిక ప్రధాన రహదారి ఇరు వైపులా ఆహార పొట్లాలు గుట్టలుగా పడి ఉన్నాయి. అధికారులు నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిస్తున్నారని, కనీసం మంచి ఆహారం కూడా అందించడంలేదని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క ఆహారాన్ని ప్రధాన రోడ్లపైనే సరఫరా చేస్తున్నారు. ఆహారం, నీరు అందించే పడవలు, వాహనాలు కాలనీల్లోకి రాకపోవడంతో యువకులు పీకల్లోతు వరద నీటిలో వచ్చి ఆహార పొట్లాలు, తాగునీరు తీసుకుని అదే వరద నీటిలో వెళుతున్నారు. ఇదేనా ప్రభుత్వమంటే అంటూ మండిపడుతున్నారు.



డేరాలో తలదాచుకుంటున్న లక్ష్మి

క్లుప్తంగా

బాధితులకు కొత్త కష్టాలు

విజయవాడస్పోర్ట్స్: ఎగువనున్న కొండ ప్రాంతాల నుంచి బుడమేరు వరదలో కొట్టుకొచ్చిన జలగలు, పాములు, కొండ చిలువలు ముంపు బాధితులకు కొత్త కష్టాలు తెచ్చిపెడుతున్నాయి. విజయవాడ నగరంలోని పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాల్లోని 20 కాలనీల్లోని ఇళ్లు వరద నీటితో నిండిన విషయం తెలిసిందే. మంగళవారం మధ్యాహ్నం నుంచి వరద తగ్గుముఖం పట్టడంతో ఒక్కొక్కరుగా వారివారి ఇళ్లను చూసుకునేందు వెళ్లి ఖంగుతింటున్నారు. నివాస ప్రాంతాల్లో వరద ప్రభావంతో చెల్లాచెదురుగా పడి ఉన్న సమాన్ల మాటున విషసర్పాలు, కొండ చిలువలు తిష్టవేసి స్థానికులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. విష సర్పాలతో పాటు రక్తం పీల్చే జలగలు సైతం నీటిలో హల్‌చల్ చేస్తున్నాయి. వరద నీటిలో రెండు నిమిషాలు ఒకే చోట నిలబడితే కాళ్లకు జలగలు పట్టుకుంటున్నాయని బాధితులు చెబుతున్నారు.

నీట మునిగిన హెడ్ వాటర్ వర్క్స్

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం 38వ డివిజన్ పరిధిలో గల డాక్టర్ కె.ఎల్.రావు మున్సిపల్ హెడ్ వాటర్ వర్క్స్ వరద నీటి ముంపునకు గురయ్యింది. నగరంలోని మూడు నియోజకవర్గాలలోని మంచి నీటి రిజర్వాయర్లకు తాగు నీరు ఇక్కడి నుంచి సరఫరా చేస్తున్న నేపథ్యంలో అందుకు ఆటంకం కలిగింది. ముఖ్యంగా హెడ్ వాటర్ వర్క్స్‌లోగల మోటార్లన్నీ నీళ్లల్లో మునిగి పోవడంతో సరఫరాకు ఇబ్బందికరంగా మారింది. నగరం జలదిగ్బంధంలో ఉండగా నీటి సరఫరా చేస్తే కలుషిత నీళ్ల కుళాయిల ద్వారా వచ్చే అవకాశం ఉన్నందున నీటి సరఫరాను నిలిపి వేశారు. మంగళవారం వరద ఉధృతి తగ్గటంతో రిజర్వాయర్లకు మంచి నీటి సరఫరా ప్రారంభించారు.

దొంగలు హల్‌చల్

విజయవాడస్పోర్ట్స్: వరద నీటిలో కొట్టుమిట్టాడుతున్న బుడమేరు బాధితులను దొంగలు టార్గెట్ చేశారు. సోమ, మంగళవారాల్లో ఆయా ప్రాంతాల నుంచి ఎంతో మంది బాధితులు వారివారి ఇళ్లను వదిలేసి ప్రాణాలు అరచేతిలో పట్టుకుని ఒడ్డుకు చేరారు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇళ్లలోకి చొరబడి దొంగతనాలకు పాల్పడుతున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. మంగళవారం సాయంత్రం వరద ప్రభావం తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో బాధితులు వారివారి ఇళ్లను చూసుకునేందుకు వెళ్లి.. ఇల్లు చోరీకి గురైందని తెలుసుకుని బావురుమంటున్నారు. సింగ్‌నగర్ ఫ్లై ఓవర్‌పై పులిహోర, పాలు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేసే వాహనాల వద్ద బాధితులు ఎగబడుతున్న విషయం తెలిసిందే. గుంపులో గోవింద అన్నట్లు అక్కడా బాధితుల పర్సు, సెల్‌ఫోన్‌లను తస్కరిస్తున్నారు.

శివారు వైపు కన్నెత్తి చూడని అధికారులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వరద ముంపు ప్రాంతాల్లో సేవలందించేందుకు వచ్చిన అధికార యంత్రాంగం శివారు ప్రాంతాలు.. లోతట్టు ప్రదేశాలవైపు కన్నెత్తి చూడడం లేదు. గత మూడు రోజుల నుంచి వరద నీటిలో చిక్కుకొని అల్లాడిపోతుంటే కనీసం బతికి ఉన్నామా.. చచ్చామా.. అని కూడా చూసిన దిక్కులేదని ఇందిరానాయక్ నగర్ వెనుక భాగం, అయ్యప్పస్వామి టెంపుల్ వెనుకరోడ్డు, సన్‌సిటీ కాలనీ, భారతమాత మందిరం రోడ్డు, తోటవారి వీధి, సింగ్‌నగర్ లెనిన్‌సెంటర్, రామానగర్, వాంబేకాలనీ, నందమూరినగర్, న్యూరాజరాజేశ్వరీపేట అపార్ట్‌మెంట్స్ వెనుక ప్రాంతాలు, జామతోట, అమరావతికాలనీ, సుందరమ్మ దిబ్బ, అరునోదయనగర్ ప్రాంతాల ప్రజలు కన్నీటి పర్యంతమవుతున్నారు.

సందట్లో సడేమియా..!

ఆపత్కాలంలోనే అవకాశాలు సృష్టించుకోవాలంటూ కొందరు మేధావులు చెప్పిన మాటలను బెజవాడ వ్యాపారులు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. మానవత్వాన్ని మరిచి వ్యాపార సూత్రాలనే అచ్చంగా అమలు చేస్తూ విశృంఖలంగా దోపిడీకి శ్రీకారం చుట్టారు. ఓ పక్క రోజుల తరబడి వరద నీటిలో నానుతూ తిండీ తిప్పలు లేకుండా పడి ఉన్న బాధిత జనం వద్ద కూడా దోచుకుతింటున్నారు. కూరగాయల నుంచి నిత్యావసర వస్తువుల వరకు అన్నింటి ధరలు ఒక్కసారిగా చుక్కలనంటాయి.

- దోపిడీకి గేట్లు బార్లా తెరిచిన వ్యాపారులు
- ఏ కూరగాయలైనా కిలో వంద
- కాళేశ్వరరావు మార్కెట్‌లోనూ అదే తరహా...
- పాలప్యాకెట్ రూ.50 నుంచి రూ.80 వరకూ విక్రయాలు
- గ్యాస్ సిలిండర్ల కోసం ఏజెన్సీ వద్ద బారులు తీరిన వినియోగదారులు



కాళేశ్వరరావు మార్కెట్‌లో కూరగాయల విక్రయాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడ నగరంలో నిత్యావసర వస్తువుల ధరలకు ఒక్కసారిగా రెక్కలు వచ్చాయి. వరదలు ముంచెత్తిన ప్రాంతాలకు సమీప దుకాణాల్లో వ్యాపారులు మానవత్వం మరిచి తమ ప్రాంతం వారి వద్దనే అధిక ధరలకు అమ్మి దోపిడీ చేస్తున్నారు. ప్రధానంగా కూరగాయలు, పాలు, పెరుగు తదితర వస్తువుల ధరలు అమాంతం ఆకాశాన్నంటుతున్నాయి. ప్రభుత్వ సాయం అందక సమీపంలోని దుకాణాల వద్దకు వెళ్లి కొనుగోలు చేద్దామంటే ఈ విధమైన దోపిడీతో బాధితులు లబోదిబోమంటున్నారు.

ఏ కూరగాయైనా కిలో వంద...

నగరంలో వివిధ ప్రాంతాల్లో ఏ కూరగాయైనా కిలో వంద తక్కువకు అమ్మటం లేదు. ఎవరైనా ఇదేమిటమ్మా... అని అడిగితే ''ఇష్టముంటే కొను.. లేదంటే వెళ్లు'' అంటూ వాగ్వాదానికి దిగుతున్నారు. ఇక కాళేశ్వరరావు మార్కెట్‌లో మరో విధమైన దోపిడీ జరుగుతోంది. ఈ మార్కెట్‌లో కిలో ఏదైనా రూ.80 అంటున్నారు. అరకిలో రూ.40 అంటూ గద్దించి మరీ విక్రయాలు చేస్తున్నారు. ఆరు మునక్కాయలను కట్ట కట్టి వందకు విక్రయిస్తున్నారు. కొత్తిమీర కట్ట రూ.60 చెబుతున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే గట్టిగా కేకలేస్తున్నారంటూ వినియోగదారులు వాపోతున్నారు. ఈ ధరలన్నీ రైతుబజార్‌తో పోల్చి చూస్తే మూడు, నాలుగురెట్లు అధికంగా ఉంటున్నాయి. వీరిని అదుపు చేసే పరిస్థితులు లేకపోవటంతో వినియోగదారులు దోపిడీకి గురవుతున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల సమీపాల్లో పాలు అరలీటర్ ప్యాకెట్ రూ.50 నుంచి రూ.80 వరకూ విక్రయిస్తున్నారు.

గ్యాస్ సిలిండర్ల కోసం బారులు



నగరంలో గ్యాస్ సిలిండర్ల కోసం వినియోగదారులు బారులు తీరుతున్నారు. గ్యాస్ సిలిండర్లను అందించే సిబ్బంది నగరంలోని పలు ప్రాంతాల్లోని ఇళ్లకు వచ్చే పరిస్థితులు లేకపోవటంతో వారు సిలిండర్లను తీసుకుని ఏజెన్సీల వద్దకు తరలివస్తున్నారు. ఏజెన్సీ కార్యాలయం వద్ద సిలిండర్లతో వేచి చూస్తున్నారు. వాహనాల్లో అక్కడకు సిలిండర్లు రాగానే గ్యాస్ కంపెనీ వారు బండను అప్పగిస్తే వాటిని తీసుకుని ఇళ్లకు వెళ్తున్నారు. వర్షాలు, ఆపైన బుడమేరు వరద పరిస్థితులతో గడిచిన వారం రోజులుగా నగరంలో గ్యాస్ సిలిండర్ల సరఫరా మందకొడిగా జరుగుతోంది. దాదాపుగా సగానికి పైగా ప్రాంతాల్లో గ్యాస్ బండల సరఫరా నిలిచిపోయింది.

పారిశుద్ధ్య పనులు ముమ్మరం

అధికారులకు కలెక్టర్ బాలాజీ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ, చిత్రంలో జేసీ గీతాంజలిశర్మ, డీఆర్వో శ్రీదేవి

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో వరద ఉధృతి తగ్గుతున్న నేపథ్యంలో ప్రభావిత పట్టణాలు, గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి మంగళవారం ఆయన క్షేత్ర స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులను నిర్వహించాలన్నారు. కాలువల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయాలన్నారు. కాలువల్లో పూడికతీత పనులను చేపట్టి నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా చూడాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, ఇతర వైద్యాధికారులతో సమన్వయం చేసుకుని దోమల నివారణకు ఐఆర్‌ఎస్ మందులను వెదజల్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏఎన్‌ఎంలు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి వైద్య సహాయం అందించాలన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, పాము కాటు విరుగుడు మందుతో సహా అన్ని మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వరదకు గురైన గ్రామాల్లో వాటర్ ట్యాంకులను ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో తనిఖీ చేసి వాటిని సత్వరమే శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలందరూ కాచి చల్లార్చిన నీటిని తాగేలా అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలందరికీ ఒక్కొక్క కుటుంబానికి 25 కిలోల బియ్యం, కిలో పంచదార, కిలో కందిపప్పు, లీటరు పామాయిల్ పంపిణీ చేయాలన్నారు. మత్స్యకారులు, చేనేత కార్మికులకు 50 కిలోల బియ్యం అందజేయాలన్నారు. పంట పొలాల్లో వరదనీరు అలాగే ఉంటే పంటలు పాడై నష్టం వాటిల్లే అవకాశం ఉన్నందున నీటిని యుద్ధప్రాతిపదికన తొలగించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ, ఇన్‌చార్జ్ డీఆర్వో బి.శ్రీదేవి, జెడ్పీ సీఈవో ఆనందకుమార్, డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయి, డీఎస్‌వో పార్వతి, ఆర్‌అండ్‌బీ ఈఈ ఎ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో స్టేడియం క్రీడాకారుల ప్రతిభ



తహసీల్దార్‌తో పతకాలు సాధించిన క్రీడాకారులు

గుడివాడటౌన్: రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో తమ క్రీడాకారులు ప్రతిభను ప్రదర్శించి పతకాలు సాధించారని స్టేడియం కమిటీ కోశాధికారి, తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆయన క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1వ తేదీ వరకు అనకాపల్లి పట్టణంలో జరిగిన 8వ రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఎస్.వీరనాగు అను 51 కిలోల విభాగంలో 80 కిలోల బరువును ఎత్తి వెండి పతకం, వి.భగవత్ బాలాజి 81 కిలోల విభాగంలో 129 కిలోల బరువును ఎత్తి వెండి పతకం, బండారు విష్ణువర్ధన్ 109 కిలోల విభాగంలో 267 కిలోల బరువును ఎత్తి వెండి పతకం సాధించారన్నారు. ఇంతటి ప్రతిభను ప్రదర్శించిన క్రీడాకారులను, కోచ్ మార్నెళ్ల వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ కోచ్ జంపా ఉషాకుమారిలను తహసీల్దార్ అభినందించారు.

కొనరు.. కొట్టేస్తారు

- ఖరీదైన పట్టుచీరలే లక్ష్యం
- బెంగళూరులో మహిళా దొంగల ముఠా అరెస్టు



పోలీసులు అరెస్టు చేసిన చీరల దొంగలు

బనశంకరి: దుకాణదారుల దృష్టి మళ్లించి లక్షలాది రూపాయలు విలువచేసే పట్టుచీరలు దోపిడీకి పాల్పడే మహిళా ముఠాను మంగళవారం బెంగళూరు జేపీ నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రూ.17.50 లక్షల విలువచేసే 38 పట్టుచీరలను స్వాధీనం చేసుకున్నామని నగర పోలీస్ కమిషనర్ బి.దయానంద్ తెలిపారు. మంగళవారం కేసు వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు.

10 చీరలు ఎత్తుకెళ్తుండగా...

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ జిల్లా మైలవరం నివాసి పొన్నూరు మల్లి, చెవుటూరు నివాసి సాదు పట్టి, కొండపల్లి నివాసి మేద రజని, గుంటూరు జిల్లా ఉండవల్లి నివాసి మదుగాని జానకి అనే నలుగురు మహిళలు ఒక ముఠాగా ఏర్పడి చీరల చోరీకి తెరతీశారు. జేపీ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సిల్క్‌హౌస్‌లోకి చీరలు కొనాలని వెళ్లారు. అక్కడి సిబ్బంది వారికి పలురకాల పట్టుచీరలు చూపించారు. ఈ సమయంలో వారిలో కొందరు సిబ్బంది దృష్టి మళ్లించి చీరలను దుస్తుల్లో దాచుకునేవారు. ఇలా విలువైన 8 పట్టుచీరలను దొంగిలించారు. ఇటీవల మరోసారి అదే షాపులో 10 పట్టుచీరలను దుస్తుల్లో దాచుకుని వెళ్లిపోతుండగా షాపు యజమాని అడ్డుకుని పరిశీలించగా 10 పట్టుచీరలు బయటపడ్డాయి. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి చీరలను, మహిళలను పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. ముఠాలో మరో ఇద్దరు మహిళలు ఉన్నారని నిందితులు తెలిపారు. చోరీకి పాల్పడిన పట్టుచీరలను కోరమంగలలో నివాసం ఉండే స్నేహితునికి ఇచ్చినట్లు తెలిపారు. పోలీసులు అక్కడ సోదాలు చేసి మరో 28 పట్టుచీరలను స్వాధీనం చేసుకున్నారు, వాటి విలువ రూ.17 లక్షలపైనే ఉంటుందని పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు మహిళల కోసం గాలింపు చేపట్టారు. విలేకరుల సమావేశంలో డీసీపీ లోకేశ్ భరమప్ప, ఏసీపీ నారాయణ స్వామి, సీఐ రాధాకృష్ణ పాల్గొన్నారు.

బుడమేరుకు గండి

- ఏలూరు కాలువలోకి ప్రవహిస్తున్న వరద నీరు
- ఆందోళనలో మధురానగర్‌వాసులు



ఏలూరు కాలువలోకి ప్రవహిస్తున్న బుడమేరు వరద నీరు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు మధ్య కట్ట విజయదుర్గానగర్‌లో బుడమేరుకు మంగళవారం గండిపడింది. విజయదుర్గానగర్ రైల్వేవంతెన సమీపంలో గండిపడటంతో బుడమేరు వరదనీరు పక్కనే ఉన్న ఏలూరు కాలువలోకి ఉధృతంగా ప్రవహిస్తోంది. రైల్వే వంతెన పక్క నుంచి వరద ప్రవాహం వేగంగా సాగుతుండటంతో మధురానగర్ వాసులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు కాలువ నుంచి ఎక్కడ వరద తమ ప్రాంతాలలోకి వస్తుందోనని ఆందోళనకు గురవుతున్నారు. గండిపడిన ప్రాంతంలో ఇళ్లు లేకపోవటం, పక్కనే ఏలూరు కాలువ ఉండటం వల్ల పెద్ద ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న స్థానిక కార్పొరేటర్ పెనుమత్సశిరీష సత్యం ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానికులకు ధైర్యం చెప్పారు

గండి వల్ల ప్రమాదం లేదు: ఎమ్మెల్యే

బుడమేరు గండి వల్ల ప్రమాదం ఏమీ ఉండదని తాము ప్రజలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు అన్నారు. విజయదుర్గానగర్‌లో బుడమేరు గండిపడిన ప్రాంతాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. గండి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

తగ్గిన బుడమేరు ఉధృతి..

బుడమేరు గండి పడటంతో గత రెండ్రోజులుగా ముంపులో ఉన్న రామకృష్ణాపురం, దేవీనగర్, గద్దె వెంకట్రామయ్యనగర్, దావు బుచ్చయ్యకాలనీ తదితర ప్రాంతాలలో వరద ఉధృతి తగ్గింది. రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు తొలగిపోవటంతో రాకపోకలు పునః ప్రారంభమయ్యాయి. గంటకు గంటకు బుడమేరు ప్రవాహం తగ్గుతుండటంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

బాధితులకు అరకొరగా సాయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): వరద ముంపు ప్రాంతాలలో బాధితులకు అరకొర సేవలు మాత్రమే అందుతున్నాయి. ప్రభుత్వం పంపించిన పాల ప్యాకెట్లు సైతం ముంపు ప్రాంతాలలో ఉన్నవారికి కాకుండా రోడ్డుపై ఉన్న కొంత మందికి అందజేసి వెళ్లిపోతున్నారు. దీంతో నిజంగా వరద బాధితులకు న్యాయం జరగటం లేదు. ప్రభుత్వం పంపించిన పాలను ముంపులో ఉన్న, దేవీనగర్, జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ, బుడమేరు మధ్య కట్టవాసులు కాకుండా సమీపంలోని మధురానగర్ తదితర ప్రాంత వాసులు అందుకుంటున్నారు. తీసుకున్న వారే రెండు మూడు తీసుకుంటున్నారని కొంత మందికి అసలు పాలు దొరకక పోవటంతోచిన్నారులకు పాలు అందటంలేదని వాపోతున్నారు.అలాగే ఉచితంగా పంపిణీ చేయాల్సిన పాలను కొంత మంది దళారీలు అమ్ముకుంటున్నారని ఆరోపిస్తున్నారు.

అందని ఆహారం

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రభుత్వ సహాయం అందని ద్రాక్ష వలే ఉంది. మంగళవారం మధ్యాహ్నం ఒక హెలికాప్టర్ 64వ డివిజన్ కండ్రిక వాటర్ ట్యాంక్‌కు సమీప ఎత్తులో ఉంటూ వరద బాధితుల కోసం ఫుడ్‌ప్యాకెట్లు ఉన్న 50 బ్యాగులను దించింది. ఆ సహాయం కోసం బాధితులు పరుగులు తీసి వాటర్ ట్యాంక్ పైకి ఎక్కి అందిన వారు అందినట్లుగా తీసుకొని వెళ్లారు. వాటర్ ట్యాంఖ మెట్లు ఎక్కలేని వారికి ప్రభుత్వ సహాయం అందలేదు. హెలికాప్టర్ ద్వారా కాకుండా పడవల ద్వారా ప్రభుత్వం సహాయం అందజేయాలని బాధితులు కోరుతున్నారు.

ముగిసిన సంగీతోత్సవాలు

విజయవాడ కల్చరల్: లయనాద కళా ప్రవంతి ఆధ్వర్యంలో సంగీత విద్వాంసుడు లంకా వేంకటేశ్వర్లు సంస్మరణ సందర్భంగా వారం రోజులుగా దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న వార్షిక సంగీతోత్సవాలు బుధవారం ఉదయం ముగిశాయి. శాస్త్రీయ సంగీతానికి పెద్ద పీట వేస్తూ విద్వాంసులు నిర్వహించిన కచేరీలు శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటాయి. వీవీ రాఘురామ ప్రణవ, ఆర్. వైష్ణవి, పెరవలి జయతి, పెరవలి మహతి వాగ్గేయకారుల కృతులను ఆలపించారు. చివరిగా కె. తుషార పూర్ణవల్లి నిర్వహించిన కచేరీ ఆకట్టుకుంది. వయోలిన్‌పై కె. సుబ్రహ్మణ్యరాజు, మృదంగంపై ఎం. కృష్ణసాయి సహకరించారు.

వరద ప్రాంతాలు పరిశీలించిన మంత్రి



ఇబ్రహీంపట్నంలో వరద ప్రభావాన్ని మంత్రి బాల వీరాంజనేయ స్వామికి వివరిస్తున్న ఎమ్మెల్యే వసంత

ఇబ్రహీంపట్నం: మండలంలోని మూలపాడు, ఇబ్రహీంపట్నంలో వరద ప్రభావిత ప్రాంతాలను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాల వీరాంజనేయస్వామి మంగళవారం పరిశీలించారు. ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్, మూలపాడు శివాలయం వద్దకు చేరిన వరద నీటిని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. మండలంలో వరద ప్రభావాన్ని ఎమ్మెల్యే వసంత మంత్రికి వివరించారు. కనీవినీ ఎరగని రీతిలో వచ్చిన ప్రకృతి వైపరీత్యం ప్రజలను, పంటపొలాలను తీవ్రమైన నష్టానికి గురిచేసిందన్నారు. ప్రభుత్వం ఆదుకుంటుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

వరదకు కొట్టుకుపోయిన కార్లు



కీసర సమీపంలో వరద ఉధృతికి కొట్టుకుపోయిన కార్లను బయటకు తీస్తున్న సిబ్బంది

కంచికచర్ల: ఇటీవల కుండపోతగా కురిసిన వర్షానికి ఐతవరం సమీపంలో జాతీయ రహదారిపై మున్నేరు నుంచి భారీగా వరద నీరు చేరింది. విజయవాడ వైపు నుంచి హైదరాబాద్‌కు వెళ్లే 12 కార్లు వరదనీటికి పొలాల్లోకి కొట్టుకుపోయాయి. అయితే అధికారులు స్పందించి మంగళవారం మండలంలోని కీసర టోల్‌ప్లాజా అధికారులతో చర్చించి పెద్ద పెద్ద క్రేన్‌ల సహాయంతో పొలాల్లో బురదనీటిలో చిక్కుకున్న 12 కార్లను బయటకు తీశారు. రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన ఎమర్జన్సీ ఫోన్‌లు కూడా వరదనీటికి కొట్టుకుపోయాయి. కంచికచర్ల, నందిగామ పోలీసులు, రెవెన్యూ అధికారులు దగ్గరుండి వరద ఉధృతికి కొట్టుకుపోయిన కార్లను, ఎమర్జన్సీ ఫోన్లను బయటకు తీయించారు.

పోక్సో కేసు నమోదు

కంచికచర్ల: మైనర్ బాలికపై లైంగికదాడికి పాల్పడిన ఓ వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బోనగిరి రాజు మంగళవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు స్థానిక రైతు బజార్ సమీపంలో నివాసముంటున్న ఓ మైనర్ బాలికపై అదే ప్రాంతంలో ఉంటున్న లారీ డ్రైవర్ సూరపనేని రామారావు లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుడు రామారావును అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా పరారీలో ఉన్నాడని ఎస్ఐ తెలిపారు.

వరదల్లో గల్లంతైన నలుగురి మృతి

ఆదివారం బుడమేరు వరదల్లో కొట్టుకుపోయిన నలుగురు వ్యకులకు సంబంధించిన మృతదేహాలు మంగళవారం కనుగొన్నారు. అధికారులు ఆయా మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. మృతుల్లో విజయవాడ రూరల్ మండలం పాతపాడుకు చెందిన రేవూరి సతీష్‌కుమార్, పైడూరుపాడు గ్రామానికి చెందిన బద్రి నాగ దుర్గారావుతో పాటు ఇబ్రహీంపట్నం మండలం కీలేశపురంలో లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న వత్సవాయికి చెందిన కె.కోటేశ్వరరావు, విజయవాడ కార్మెల్ నగర్‌లో ఆదివారం వరదలో గల్లంతైన గుణదల విజయనగర్ కాలనీకి చెందిన కొల్లిపర సందీప్ ఉన్నారు.



వరదలో గల్లంతై మృతి చెందిన సతీష్‌కుమార్



బద్రి నాగ దుర్గారావు(ఫైల్)



కె కోటేశ్వరరావు (ఫైల్)

పాతపాడు(విజయవాడరూరల్): మూడు రోజుల క్రితం వరదల్లో గల్లంతైన యువకుడు మృతి చెంది కనిపించిన సంఘటన మంగళవారం పాతపాడు గ్రామంలో చోటుచేసుకుంది. రెవెన్యూ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం పాతపాడు గ్రామానికి చెందిన రేవూరి సతీష్‌కుమార్(16)ఆదివారం స్నేహితులతో కలసి పాతపాడు నుంచి కండ్రిక వెళ్లే రోడ్డులో ప్రవహిస్తున్న వరదను చూసేందుకు వెళ్లాడు. అనుకోని విధంగా ఉధృతంగా ప్రవహించిన వరదలో స్నేహితులతో పాటు సతీష్‌కుమార్ కొట్టుకుపోయాడు. స్నేహితులు చెట్లలో చిక్కుకొని స్థానికుల సహాయంతో ఒడ్డుకొచ్చారు. సతీష్ మాత్రం వరదలో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. రోజు రోజుకు పెరుగుతున్న వరద ఉధృతికి మృతుని కుటుంబ సభ్యులు గజ ఈతగాళ్లతో వెతికించినా ఆచూకీ లేదు. మూడవరోజు కుటుంబ సభ్యులు తామే స్వయంగా పడవలో గాలించగా కండ్రిక శ్రీసిటీ వెంచర్ ప్రహరీ వద్ద సతీష్ మృతదేహం కనపడింది. మృతదేహానికి అధికారులు పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కొట్టొచ్చినట్టు కనపడుతున్న ప్రభుత్వ నిర్లక్ష్యం

భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని, బుడమేరు పొంగే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు చేసినా రాష్ట్ర ప్రభుత్వం తగిన విధంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం వలనే ఊహించని విధంగా వరద వచ్చి సతీష్ ప్రాణాలు కోల్పోయాడని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సతీష్ తల్లిదండ్రులు కూలి పనులు చేసుకుని జీవిస్తారు. చేతి కందివచ్చిన తమ కుమారుడు వరదల్లో చిక్కుకొని మృతి చెందాడని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా అంబాపురం-జక్కంపూడి గ్రామాల మధ్య ఆదివారం పడవ బోల్తా పడి వరదలో కొట్టుకుపోయి మృతిచెందిన నున్న గ్రామానికి చెందిన దారా శ్యామ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మృతుని భార్య కోరుతోంది.

వరదల్లో గల్లంతైన యువకుడు మృతి

పైడూరుపాడు(విజయవాడరూరల్): మూడు రోజుల క్రితం వరదల్లో గల్లంతైన పైడూరుపాడు గ్రామానికి చెందిన బద్రి నాగ దుర్గారావు(33) మృతి చెందాడు. గ్రామ రెవెన్యూ అధికారి ఎస్.నాగ సత్యవతి తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం ఉదయం పైడూరుపాడు ఎస్సీ కాలనీ నుంచి న్యూ ఎస్సీ కాలనీకి మరో ముగ్గురు వ్యక్తులతో కలిసి బద్రి నాగ దుర్గారావు నడుచుకుంటూ వెళుతుండగా బుడమేరు వరద ఒక్కసారిగా ఉధృతంగా ప్రవహించడంతో అదుపు తప్పి పడిపోయాడు. అతని కోసం స్నేహితులు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. వరదల్లో గల్లంతైన నాగ దుర్గారావు కోసం మంగళవారం కుటుంబ సభ్యులు గాలించగా పొలాల్లో శవమై కనిపించాడు. అతని మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతునికి భార్య సలోమి ఉంది. వరదలకు సంబంధించి వాతావరణ శాఖ ముందుగా హెచ్చరికలు చేసినా రాష్ట్ర ప్రభుత్వం తగిన విధంగా ముందస్తు జాగ్రత్తలు చేపట్టక పోవడం వల్ల దుర్గారావు మృతి చెందాడని గ్రామ సర్పంచి వేముల సీతారామయ్య అన్నారు. మృతుని కుటుంబానికి తగిన ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని కోరారు.

గల్లంతైన విద్యుత్ లైన్‌మెన్ మృతి

ఇబ్రహీంపట్నం: వరద ముంపునకు గురైన పంట పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేసేందుకు ఆదివారం సాయంత్రం వెళ్లి గల్లంతైన విద్యుత్ లైన్‌మెన్ వి.కోటేశ్వరరావు(38) మంగళవారం విగతజీవిగా లభించాడు. కాలుజారి పడిన 100మీటర్ల దూరంలోనే మృతదేహం లభించడం చర్చనీయాంశమైంది. గల్లంతైన సమయం నుంచి ఎస్డీఆర్‌ఎఫ్ సిబ్బందితో గాలించాలని కుటుంబ సభ్యులు, బంధువులు కోరినప్పటికీ అధికారులు స్పందించకపోవడం వలనే మృతి చెందాడని ఆరోపణలు ఉన్నాయి. వత్సవాయి మండలానికి చెందిన మృతుడు కోటేశ్వరరావు రెండు నెలల క్రితమే ఉద్యోగోన్నతిపై పశ్చిమ ఇబ్రహీంపట్నం లైన్‌మన్‌గా బాధ్యతలు స్వీకరించాడు. మృతుడికి భార్య, 14ఏళ్ల పాప, 10ఏళ్ల బాబు ఉన్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గల్లంతైన మరో మృత దేహం లభ్యం

గుణదల(విజయవాడ తూర్పు): వరద ఉధృతిలో గల్లంతైన మృతదేహం లభ్యమైనట్లు మంగళవారం గుణదల పోలీసులు తెలిపారు.సేకరించిన సమాచారం ప్రకారం గుణదల విజయనగర్ కాలనీకి చెందిన కొల్లిపర వెంకటేశ్వరరావు, అతని కుమారుడు సందీప్ స్థానిక కార్మెల్ నగర్ ప్రాంతంలో డెయిరీ ఫామ్ నిర్వహిస్తుంటారు. ఈ నెల1వ తేదీ సాయంత్రం డెయిరీ ఫామ్‌కు వెళ్లిన తండ్రీ కొడుకులిద్దరూ ఇంటికి తిరిగి రాలేదు.దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు గుణదల పోలీసులను ఆశ్రయించారు. రెస్క్యూ టీమ్ సహాయంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా తండ్రి వెంకటేశ్వరరావు మృతదేహం లభ్యమైంది. మంగళవారం సందీప్ మృతదేహం లభ్యమైనట్లు గుణదల పోలీసులు తెలిపారు.